క్లుప్తంగా

చిన్మయ విద్యాలయ వార్షికోత్సవం



వేదిక్ చాంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: పట్టణంలోని డీవీడీబీఎస్ చిన్మయ విద్యాలయ 56వ వార్షికోత్సవం, చిన్నారులకు ఉచిత విద్య అందిస్తున్న చిన్మయ హరిహర విద్యాలయం 3వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల వేదిక్ చాంట్‌తో మొదలై వివిధ నృత్యాలు ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శుభదానంద మాతాజీ, మండల విద్యాశాఖాధికారి గంగప్ప పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి



ఆకట్టుకున్న చిన్నారుల గ్రూప్ డ్యాన్స్

హిందూపురం: విద్యార్థులకు క్రమశిక్షణ అలవడినప్పుడే విద్య విజ్ఞానం చేరువ అవుతాయని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని దీప్తి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం సాయంత్రం దీప్తియన్ సింపోనియం ప్రారంభమైంది. రెండురోజులు జరిగిన స్కూల్ డే జరగనుంది. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్, తహసీల్దార్ వెంకటేష్, ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదవాలన్నారు. చిన్నారుల వేషధారణలతో ఆటపాటలు, నృత్యాలు ఎంతో విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్రహం కుట్టి అంకుల్, వైస్ ప్రిన్సిపాల్ లూసి అబ్రహం, డైరెక్టర్ దీపు అబ్రహం, హెడ్ మాస్టర్ షాజీ పాల్గొన్నారు.

మోడల్ పేపర్ల పంపిణీ

రొద్దం: నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను గ్రామానికి చెందిన ధనుంజయ్య గౌడ్, యల్లమ్మ సౌజన్యంతో ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సానిపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శి మారుతి, గౌరవాధ్యక్షుడు రమేష్, శేషాద్రి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పెనుకొండ: పట్టణంలోని శివసాయి మందిరంలో షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం జరుగుతున్న ఉచిత శిబిరానికి రోగులు భారీగా తరలివచ్చారు. సాయి కాశీశ్వర్ జయంతిని పురస్కరించుకుని ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్పాతో పాటు సాయి కాశీశ్వర్ కుమార్తె నవ్యశ్రీ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలతోపాటు తగిన మందులు పరికరాలు అందజేశారు. ఆశ్రమ సిబ్బంది చిట్టిబాబు, హరి, బాబు తదితరులు పాల్గొన్నారు.

కనకాంబరం.. కాసుల వర్షం

- పూల సాగుతో అధిక ఆదాయం గడిస్తున్న రైతులు
- ధరలు స్థిరంగా ఉండడంతో అన్నదాతల్లో హర్షం





చిల్లకొండయ్యపల్లిలో కనకాంబరం పూలను కోస్తున్న రైతులు

తాడిమర్రి: సొంత భూమి ఉన్న రైతులు సంవత్సరం పొడవునా అదాయం పొందాలంటే కనకాంబరం సాగు చేపట్టటం చాలా ఉత్తమని ప్రయోగాత్మకంగా నిరూపించారు తాడిమర్రి మండల రైతులు. వేరుశనగ, వరి తదితర సంప్రదాయ పంటల సాగులో నష్టపోయిన రైతులు ఇటీవల పూల సాగుపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే జిల్లాలో 380 ఎకరాల్లో కనకాంబరం పూల సాగులోకి వచ్చింది. ఇందులోనూ తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి, పుల్లానారాయణపల్లి, ఏకపాదంపల్లి, భీమరాయునిపేట, ఎం.అగ్రహారం, మర్రిమాకులపల్లి తదితర గ్రామాల్లో రైతులు అత్యధికంగా కనకాంబరం సాగునే చేపట్టారు.

కనకాంబరాలకు డిమాండ్ ఎక్కువ..

చెన్నై, బెంగుళూరు, తిరుపతి, హైదరాబాద్ తదితర నగరాల్లో కనకాంబరం పూలకు చాలా డిమాండ్ ఉంది. తాడిమర్రి మండలంలో కనకాంబరాలను సాగు చేసిన రైతులు దిగుబడులను బత్తలపల్లిలో పూల మండీల ద్వారా ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. జూన్ నుంచి డిసెంబర్ ఆఖరు వరకు సాధారణంగా ఉన్న ధరలు జనవరిలో తగ్గు ముఖం పడతాయి. కానీ, ఈ ఏడాది ఇప్పటికీ రైతులకు గిట్టుబాటు ధరనే లభ్యమవుతోంది.

సాగులో తలెత్తే ప్రధాన సమస్యలు..

కనకాంబరం సాగులో తలెత్తే ప్రధాన సమస్యల నివారణకు ఉద్యానవన శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. నులిపురుగుల సమస్య నివారణకు దుక్కిలో వేపపిండి వేసుకోవాలి. అలాగే కార్బోఫ్యూరాన్ 3–4 గుళికలను ఎకరానికి 400 గ్రాముల ప్రకారం ఇసుకలో కలిపి చల్లుకుంటే నులిపురుగు నివారణ సాధ్యమవుతుంది. పేనుబంక నివారణకు మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయేట్ 2 ఎం.ఎల్.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎండు తెగులు నివారణకు ఎకరాకు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, 2 కిలోల ట్రికోడెర్మా విరిడి కలిపి 10 రోజుల పాటు నీడలో మగ్గబెట్టి తర్వాత దుక్కిలో వేసుకోవాలి. తెగులు సోకినట్లు కనిపిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ అర కిలో ఎకరానికి చొప్పున డ్రిప్పు ద్వారా అందించవచ్చు. లేదా, మొక్కలు తడిచేలా నేలను తడపితే సరిపోతుంది.

నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం

- కనకాంబరం సాగులో నీటి వాడకం తక్కువగా ఉంటుంది.
- సాధారణంగా కనకాంబరం పూలు ఏడాది పొడవునా కాస్తూనే ఉంటాయి.
- ఒకసారి నాటితే సుమారు మూడు, నాలుగేళ్ల పాటు పంట దిగుబడి వస్తుంది.
- పంటను సాగు చేసిన మూడు, నాలుగు నెలలకు కోతకు వస్తాయి.
- ఐదు రోజులకు ఒక కోత చొప్పున నెలకు ఆరు కోతలు ఉంటాయి.
- ఎకరా విస్తీర్ణంలో ప్రతి కోతకు 20 నుంచి 25 కిలోల పూల దిగుబడి ఉంటుంది.
- సాధారణ రోజుల్లో కిలో కనకాంబరాలు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు అమ్ముడుపోతాయి. పండుగ రోజుల్లో రూ.1,100 నుంచి రూ.1,200 వరకు ధర పలుకుతుంటాయి.
- ఐదు రోజులకు ఓ కోత చొప్పున నెలకు 6 కోతలతో రూ.లక్షకు పైగా ఆదాయం ఉంటుంది.
- అధిక దిగుబడులు, పూల నాణ్యతకు వేరుశనగ చెక్క, వేపపిండి, డీఏపీ తదితర ఎరువులను వాడాల్సి ఉంటుంది.

లాభాలు వస్తున్నాయి



ఆరు నెలల క్రితం ఒక ఎకరంలో కనకాంబరాల సాగు చేపట్టాను. మూడు నెలలుగా పూలు కోతకు వస్తున్నాయి. సేంద్రీయ ఎరువులు వాడాను దీంతో పూలు ఎంతో నాణ్యతగా ఉంటున్నాయి. కనకాంబరం సాగు ఎంతో లాభదాయకంగా ఉంది.

– చెడిపోతుల శివయ్య, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



కనకాంబరం సాగుకు పెట్టుబడులు ఎక్కువ అవుతున్నాయి. ఒక ఎకరం విస్తీర్ణంలో పంటను సాగు చేయాలంటే విత్తనం, ఎరువులు, ఇతర పెట్టుబడుల కోసం సుమారు రూ.80 వేల వరకు ఖర్చు వస్తోంది. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనం, ఎరువులు అందిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– చిల్లా కాటమయ్య, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

రూ.16 వేలు రాయితీ ఇస్తాం



కనకాంబరాలు సాగుకు ముందుకు వచ్చే రైతులకు హెక్టారుకు రూ.16 వేలు చొప్పున రాయితీనిస్తాం. 25 సెంట్లలో సాగు చేసినా, అర ఎకరం, ఒక ఎకరంలో సాగు చేసినా సబ్సిడీ అందజేస్తాం. పంటను సాగు చేసిన ప్రతి రైతు సచివాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలి.

– అమరేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి, ధర్మవరం డివిజన్

‘ఉపాధి’లో వెలుగు చూసిన అవినీతి



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయప్రసాద్

రొళ్ల: మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సాయంత్రం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావుతో పాటు డ్వామా పీడీ కె.విజయప్రసాద్ హాజరై ప్రొసిడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి పథకం, పంచాయతీరాజ్‌శాఖలో పూర్తి చేసిన 577 పనులకు గాను రూ.4.51 కోట్లు ఖర్చు పెట్టారు. వెచ్చించిన నిధులకు చేపట్టిన పనులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని వారం రోజులుగా డీఆర్పీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సిద్ధం చేసిన నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఉపాధి పథకంలో రూ. 1,85,652 లక్షలు, పంచాయతీరాజ్‌శాఖలో రూ.23,527 వేలు మొత్తం రూ.2,09,179 లక్షలు దుర్వినియోగం అయినట్లు వెల్లడించారు. అనంతరం మడకశిర నియోజకవర్గంలోని వక్క, అరటి పంటలను ఉపాది పథకానికి అనుసంధానం చేయాలని రత్నగిరి పంచాయతీ పరిధిలోని రైతులు జగన్నాథ్, శ్రీనివాసులు తదితరులు డ్వామా పీడీ కె.విజయప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు, ఎస్‌ఆర్పీ చంద్రమోహన్, ఏపీఓ ఓబుళప్ప, జేఈ మారేగౌడు, డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు, వివిధ శాఖల అధికారులు, ఉపాది సిబ్బంది, కూలీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



రొళ్ల మండలం కొత్తపాళ్యం వేంకటేశ్వర ఆలయాన్ని ముస్తాబు చేసిన దృశ్యం

హిందూపురం: పట్టణంలో శుక్రవారం వైకుంఠ ఏకదశి పురస్కరించుకుని గురువారం రాత్రి ఆలయాలను ముస్తాబు చేశారు. మెయిన్ బజార్‌లోని పేట వెంకటరమణ ఆలయం, గుడ్డం రంగనాథస్వామి, శ్రీనివాస మందిరం, ఆర్‌పీజీటీ రోడ్డు బాలాజీ ఆలయం, లక్ష్మీపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాల వద్ద ప్రత్యేక దర్శనాలు, వివిధ భక్తి సంకీర్తన కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు.

రొళ్ల: మండలంలోని కొత్తపాళ్యం వేంకటేశ్వరస్వామి, రొళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయాలను ముస్తాబు చేశారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడానికి తరలిరావాలని కమిటీ సభ్యులు సూచించారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ట్యాంకర్



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన గొర్రెల కళేబరాలు



తీవ్రంగా గాయపడిన ఓబుళపతి

- అడ్డుపడ్డ గొర్రెల కాపరికీ తీవ్రగాయాలు
- 15 గొర్రెలు మృతి, మరో 25 గొర్రెలకు తీవ్రగాయాలు

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై ఓ ట్యాంకర్ బీభత్సాన్ని సృష్టించింది. గొర్రెల మందపైకి దూసుకెళ్లడంతో 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. అడ్డుకోబోయిన కాపరి సైతం తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... బత్తలపల్లి మండలం కోడేకండ్ల గ్రామానికి చెందిన ఓబుళపతి జీవాల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం తన భార్య కామేశ్వరితో కలసి జీవాలను మేపునకు తోలుకు వెళ్లాడు. జ్వాలాపురం క్రాస్ వద్ద జాతీయ రహదారిని దాటిస్తున్న సమయంలో సేలం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ట్యాంకర్ దూసుకొస్తుండడం గమనించి ఓబుళపతి అడ్డుకోబోయాడు. అయినా డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక కాపరిని ఢీకొని గొర్రెల మందపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే 15 గొర్రెలు మృతి చెందాయి. కళేబరాలు ఛిద్రమై రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. మరో 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఓబుళపతి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కాపరి భార్య గట్టిగా కేకలు వేయడంతో పొలాల్లోని రైతులు, రోడ్డుపై వెళుతున్న వారు ట్యాంకర్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో డ్రైవర్ వాహనాన్ని ఆపి అక్కడి నుంచి పారిపోయాడు. క్షతగాత్రుడిని స్థానికులు ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, బాధిత గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ బండి సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు బండి రాములమ్మతో పాటు పలువురు గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి స్థానిక అధికారులతో ఆరా తీసినట్లు సమాచారం. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా గొర్రెల కొనుగోలుకు రుణం అందించేందుకు అవకాశాలు పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

నేడు ఉషశ్రీ చరణ్ పర్యటన

పరిగి (సోమందేపల్లి): సోమందేపల్లితోపాటు పరిగి మండలంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ శుక్రవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు నరసింహమూర్తి, శ్రీనివాసులు తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో జరిగే పూజల్లో ఆమె పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రియల్టర్ మిస్సింగ్



నరేష్

హిందూపురం అర్బన్: స్థానిక శ్రీకంఠపురానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నరేష్ కనిపించడం లేదు. తొలుత ప్యూరిఫైడ్ వాటర్ వ్యాపారం సాగించే ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించి తొలుత టీడీపీలో, అనంతరం వైఎస్సార్‌సీపీలో పనిచేశారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామికి మద్దతుగా పనిచేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించిన తర్వాత కర్ణాటకలోని గౌరీబిదనూరు, చిక్కబళాపురంలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని తన వ్యాపారాన్ని విస్తరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం ఉదయం భార్య మంగళగౌరి చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ అబ్దుల్ కరీం తెలిపారు.

ఆశావర్కర్ అనుమానాస్పద మృతి



మృతురాలు నసీమా

హిందూపురం అర్బన్: స్థానిక మోడల్ కాలనీలో నివాసముంటున్న మేళాపురం ప్రాంతానికి చెందిన నసీమా (39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మోడల్ కాలనీ ఆశా వర్కర్‌గా ఆమె పనిచేస్తోంది. మొదటి భర్త షకీల్ వదిలేయడంతో కొంత కాలంగా హైదర్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఇద్దరు పిల్లలు ఉండగా వారు మేళాపురంలోని తమ తాత వద్ద ఉంటున్నారు. బుధవారం రాత్రి ఇంటి పై కప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బంధువులు హైదర్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వాస్తవం నిగ్గు తేల్చండి..

ఆశా వర్కర్ నసీమా మృతిపై అనుమానాలు ఉన్నాయని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి ఇందులోని వాస్తవాలు బహిర్గతం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండో పట్టణ సీఐ అబ్దుల్ కరీంకు బుధవారం వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. నసీమా మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సాంబశివ, ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, సహకార్యదర్శి రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ

అగళి: మండలంలోని ఎ.కె.డి.హళ్లిలో శుక్రవారం రీ సర్వేపై గ్రామ సభ, అవగాహన ర్యాలీ తహసీల్దార్ సుబ్బరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు రీ సర్వే కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే రీ సర్వేలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

‘ఎస్టీ జాబితాలోకి చేర్చాలి’

అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి, బోయ కులస్తులను వాల్మీకి జాబితాలోకి చేర్చాలంటూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ లక్ష్మీదేవికి ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో తమ కులస్తులను ఎస్టీలుగా ఉన్నారని, విద్య ఉద్యోగం ప్రమోషన్ తదితర వాటిలో ఆ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ సౌకర్యాన్ని వర్తింపజేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తమ కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మంజునాథ, గుండప్ప, హనుమంతరాయలతో పాటు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో పంటల కొనుగోలు

లేపాక్షి: ప్రభుత్వం మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేస్తుందని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. గురువారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ శ్రీలత అధ్యక్షతన రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖలో కొనసాగుతున్న ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. రాగికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,290 ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కందులకు క్వింటాకు రూ.7,550 కనీస మద్దతు ధర ప్రకటించారని తెలిపారు. వరి పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ–పంట నమోదు చేసుకుని పంటల బీమా పొందుటకు అర్హత సాధించాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: నియోజకవర్గంలోని మడకశిర, గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25లోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గ్యారగొండనహళ్లి–అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ), కేపాళ్యం–మినీ అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ–ఏ), కేగొల్లహట్టి–హెల్పర్(ఓసీ), కనకనపల్లి–హెల్పర్(బీసీ–ఏ),మోరుబాగల్–2–హెల్పర్(ఓసీ), తిమ్మలాపురం–హెల్పర్(పీహెచ్),పత్తికుంట–హెల్పర్(ఓసీ),గుడ్డంపల్లి–హెల్పర్(ఓసీ) పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గోరంట్ల: మండలంలోని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో పేదలు ధర్నా చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3 సెంట్ల చొప్పున, పట్టణ ప్రాంతములోని పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ మారుతీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ పెనుకొండ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో ఆప్తులై..

హిందూపురం టౌన్: పట్టణంలోని వైఎస్సార్ పరిగి బస్టాండ్‌లో ఓ అనాథ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గురువారం ముస్లిం ధర్మ ప్రకారం అనాథ వ్యక్తికి అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎండీఎస్ అమన్ మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు జరిగితే ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఉమర్‌ఫారూక్, ఉస్మాన్, సాధిక్, అరాఫత్, రిజ్వాన్, ఇర్ఫాన్, నిజాం, తబ్రేజ్, ఖాజీసబ్ నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ

పావగడ: స్థానిక సమాజ సేవకుడు శాంతి మెడికల్స్ దేవరాజు పళవల్లి పల్లవరాయ పాఠశాలకు రూ.65 వేలు విలువ చేసే ల్యాప్ టాప్‌ను వితరణ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సైతం విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్తు తీర్చ దిద్దాలన్నారు. అలాగే నాగలమడక లోని స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులకు యూనిఫాం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరి

పావగడ: పాల ఉత్పత్తి సహకార సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బెళ్లిబట్లు చంద్రశేఖరరెడ్డి ఒక్క ఓటు మెజారిటీతో జేడీఎస్ అభ్యర్థి చన్నమల్లప్పపై విజయం సాధించారు. తుమకూరు కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉత్కంఠ భరితంగా జరిగింది. మొత్తం 57 ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డికి 29 ఓట్లు పోలు కాగా జేడీఎస్ అభ్యర్థి చన్నమల్లప్పకు 28 ఓట్లు పడ్డాయి. ఆయన గెలుపుపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తన విజయానికి సహకరించిన ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్పకు విజేత చంద్రశేఖరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానానికి విరాళం

లేపాక్షి: మండలంలోని మానేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజి జన్మదినం సందర్భంగా అన్నదానం కోసం రూ.10 వేలు విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను కమిటీ సభ్యులు సన్మానించారు.

విద్యార్థులకు పద్య పోటీలు

హిందూపురం: విద్యార్థులు తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి. పద్యాలు, కథలు చదువుతూ విజ్ఞానంతో పాటు తెలుగు భాషను కాపాడుకోవాలని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పెన్నోబలం అన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు మూల వెంకటప్ప ఆధ్వర్యంలో గురువారం వేమన శతకంలోని పద్య పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వైష్ణవి, వెంకటగిరి, చరణ్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రామిరెడ్డి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టీటీడీ పాలక మండలి రాజీనామా చేయాలి'


సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: తిరుమల తిరుపతి ఆలయం పుణ్య క్షేత్రం ఆవరణలో వైకుంఠ ఏకాదశి పర్వదినం కోసం టోకెన్లు జారీ చేసే సమయంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృత్యువాత పడడంతో పాటు పదుల సంఖ్యలో తీవ్ర గాయాలపాలైయ్యారని, ఇందుకు టీటీడీ పాలక మండలి పూర్తి బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమల తిరుపతి దేవాలయంలో చిత్తశుద్ధి లేని వారిని బోర్డు మెంబర్లుగా ఎన్నుకోవడం, వీరికి టీటీడీ పగ్గాలు ఇచ్చి తిరుమల క్షేత్రాన్ని రాజకీయ క్షేత్రంగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వ భద్రతా నిర్లక్ష్యం వైఫల్యం కారణంగానే భక్తులు మృత్యువాత పడ్డారన్నారు. హిందూ ధర్మంపై కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి, భక్తిభావం లేదన్నారు. అధికారుల వైఫల్యంతోనే ఇటువంటి ఘటన జరిగిందని స్వయంగా టీటీడీ బోర్డు చైర్మన్ పత్రిక ప్రకటన చేస్తే.. టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దీనిని కప్పిపుచ్చుకోవడానికి రాజకీయంగా ప్రకటించడం సిగ్గు చేటని విమర్శించారు. మాజీ సీఎం జగనన్నను విమర్శించే హక్కు కూటమి నాయకులకు లేదని హెచ్చరించారు. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, అపద్ధాపు హామీల ఘన చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

రొళ్ల: తిరుమల తిరుపతి దేవాలయం ఆవరణంలో టోకెన్లు పొందడానికి జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడంతో పాటు పదుల సంఖ్యలో తీవ్ర గాయాల పాలు కావడం చాలా బాధాకరమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంత రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం వారు ప్రకటన విడుదల చేశారు. ఇది ముమ్మాటికి టీడీడీ పాలక మండలి, అధికారుల తప్పిదమేనన్నారు. భక్తులకు కూటమి ప్రభుత్వం క్షమాపణలు చెప్పి బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తొక్కిసలాట ఘటన ప్రభుత్వ వైఫల్యమే

మడకశిరరూరల్: తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కుంచిటి వక్కలిగ అనుబంధ సంఘం అధ్యక్షుడు రంగేగౌడ్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆరుగురు భక్తులు మృతిచెందడం టీటీడీ చరిత్రలో చీకటి రోజన్నారు. ప్రచారాలు, ఆర్భాటాలు తప్ప ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏమీ పట్టవన్నారు. తొక్కిసలాట ఘటనపై టీటీడీ చైర్మన్ సహా స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలని, చంద్రబాబు భక్తులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


హిందూపురంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భోగి మంట వేసి నృత్యాలు చేస్తున్న దృశ్యం


అగ్రహారంలో సాంప్రదాయ దుస్తులతో విద్యార్థులు తిరుగుతున్న దృశ్యం


వి.అగ్రహారం పాఠశాలలో హరిదాసుకు భిక్షం వేస్తున్న దృశ్యం


అగ్రహారంలో గంగిరెద్దుకు పూజలు చేస్తున్న దృశ్యం


హరిదాసుల వేషధారణలో పెనుకొండలోని సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల వంటకాలను తయారు చేసుకుని విద్యార్థులతో కలసి ఆరగించారు. సిబ్బంది, విద్యార్థులు కలిసి భోగిమంటల చుట్టూ జానపద గీతాలకు సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. మహిళా అధ్యాపకులకు, విద్యార్థినులకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, కళాశాల అధ్యాపకులు యశోదాదేవి, రమేష్, శ్రీలక్ష్మీ, రవినాయక్, సుమంగళి, పార్వతి, భోజప్ప, శ్రీధర్, సరస్వతి, ప్రకాశరావు, అశ్వర్థప్ప, సుబ్బరాయుడు, రంగనాయకులు, మారుతిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి పండుగ ఉత్సవాలను ముందస్తుగా హెచ్ఎం స్వప్న, తెలుగు ఉపాధ్యాయుడు కరిబడప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తుల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పంచ కట్టు, విద్యార్థినులు లంగా, ఓనీ ధరించి ఆకట్టుకున్నారు. భోగి మంటలు, హరిదాసు నృత్యం, గంగిరెద్దుకు పూజలు తదితర వాటిని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అలాగే మండలంలోని హలుకూరు సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో సంక్రాంతి వేడుకలు చేపట్టారు ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబుళపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు అందమైన ముగ్గులను వేసి పలువురి ప్రశంసలు పొందారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలచిన విద్యార్థులకు రిటైర్డ్ ఎంఈఓ శివయ్య, ఘనగిరి పాఠశాల కరస్పాండెంట్ ఇలియాజ్ బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ లింగారెడ్డి సంక్రాంతి విశిష్టతను వివరించారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

లేపాక్షి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంస్కృతి సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు పోటీలు నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

- విజయనగర రాజులకు రెండో విడిది కేంద్రం
- మతసామరస్యం చాటుతున్న జైనాలయాలు, దర్గాలు

కళల ఖిల్లా.. పెనుకొండ!


శ్రీకృష్ణదేవరాయలు


పెనుకొండలోని గగన్‌మహల్



పెనుకొండ ముఖద్వారం

పెనుకొండ: పెనుకొండ కళల ఖిల్లాగా పరిఢవిల్లుతోంది. ఎంతో మంది కవులు, కళాకారులు, సాహితీ ప్రియులు, గొప్ప మహారాజులు, సైనికులు నడయాడిన ప్రాంతం ఇది. 500 సంవత్సరాలకు పైగా రాచరికపు చరిత్ర కలిగి చరిత్రపుటల్లో చెరగని ముద్ర వేసుకుంది. దాదాపుగా 365 ఆలయాలు విభిన్న ఆలయాలు, కట్టడాలతో అలరారుతోంది. విభిన్న సంస్కృతులతో పరిఢవిల్లిన పవిత్ర భూమి ఇది. విజయనగర రాజులతో పాటు అనేక మంది రాజులు పెనుకొండను రాజధానిగా చేసుకుని పాలన సాగించారు. అహింసా బోధనే లక్ష్యంగా ఉన్న జైన దేవాలయాలు ఇక్కడ కనిపిస్తాయి. రతనాలు రాసులుగా పోసుకుని అమ్మిన ప్రాంతమిది. ఇక్కడున్న ఆలయాలు విజయనగర రాజుల శిల్పకళా వైభవాన్ని చాటుతున్నాయి. పర్యాటకులు, భక్తులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెనుకొండను పర్యాటక రంగంగా తీర్చిదిద్దడానికి ఎన్నో చర్యలు చేపట్టారు. పెనుకొండ కొండపై ఇస్కాన్ గోల్డెన్ టెంపుల్ నిర్మిస్తే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని ఏకంగా 99 ఎకరాల మేర స్థలాన్ని కొండ క్రింది భాగంలో ఉచితంగా కేటాయించారు. బస్టాండ్, హోటళ్లు, పర్యాటకులు బసచేసేందుకు గదులు, మ్యూజియం, రిసార్ట్‌లు, ప్రార్థనా మందిరాలు తదితర కట్టడాలు నిర్మించడానికి తగిన చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా నిలచిపోయిన కొండ రోడ్డును సైతం పూర్తి చేయించారు. రోడ్డు నిర్మాణం పూర్తీ కావడంతో పెనుకొండలో పర్యాటక శోభ అధికమయ్యింది.

గగన్‌మహల్..

గగన్‌మహల్ విజయనగర రాజుల పరిపాలనా కాలంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న సుందరమైన కట్టడం. ఇసుక, రాతినార, సముద్రపు గవ్వలు, బెల్లం, సున్నం, కోడిగుడ్లు తదితర మిశ్రమాలను గానుగల్లో వేసి గారగా చేసి ఆ మిశ్రమంతో ఇండో పార్శీ శైలిలో దీన్ని నిర్మించారు. ఇక్కడ విజయగనర రాజులు పరిపాలనా కేంద్రంగా, కళాప్రియులుగా చెలికత్తెల నాట్యం చూస్తూ పరవశించి పోయేవారని పేరుంది. ఈ కట్టడం క్రింది భాగంలో రెండు ప్రధాన సారంగ మార్గాలు కొండపైకి ఉన్నాయి. అయితే పురావస్తు శాఖ అధికారులు వీటిని మూసి వేశారు. శత్రుదేర్భేధ్యమైన కోటగోడగా దీనికి పేరుంది. నేటికీ ఎంతో ఆకట్టుకునే భవనమిది. విజయనగర రాజుల కాలంలో ఎంతో సుందరంగా నిర్మించిన గాలిగోపురం గుండా రాజులు గుర్రాల్లో గగన్‌మహల్‌కు చేరుకునే వారని ప్రచారం. రాజులు కోటగోడ ముఖ ద్వారం నుంచి గగన్‌మహల్‌కు చేరే వరకు సైనికులు డేగకళ్లతో నిఘా వుంచే వారని ప్రతీతి.


పెనుకొండలో ప్రసిద్ధిగాంచిన బాబయ్యి స్వామి దర్గా

ఖిల్లా..

కొండ పైభాగంలో ఉన్న అద్భుతమైన కట్టడమిది. ఈ ఖిల్లాలో రాజులు, రాణులతో పాటు వారి పరివారం ఉండేవారని చరిత్ర చెబుతోంది. కొండ కింది భాగం నుంచి రహస్య మార్గం ద్వారా విజయనగర రాజులు ఖిల్లాకు చేరుకునే వారని చరిత్ర చెబుతోంది. రాజులు, రాణులు నివాస గదులు, వారు స్నానాలు ఆచరించే గదులు, ఈ భవనంపై సైనికులు కాపలా కాయడానికి ఉన్న సౌకర్యం చూస్తే నాటి విజయనగర రాజుల పరిపాలన తీరు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం..

కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం విజయనగర రాజుల హయాంలో ఒక వెలుగు వెలిగింది. శ్రీకృష్ణదేవరాయలు నరసింహస్వామి భక్తుడు కావడంతో పెనుకొండలో ఉన్న సమయంలో రోజూ తెల్లవారుజామునే సూర్యోదయానికి మునుపే స్నానమాచరించి మండపాల గుండా స్వామి వారిని దర్శించుకునే వాడు. సమీపంలోనే కొండ పైభాగంలో కొలను తవ్వించారు. ఇప్పటికీ ఈ కొలనులో నీరు ఉంటుంది.

365 దేవాలయాలు ఉన్న ప్రాంతం..

పెనుకొండలో విజయనగర రాజులు 365 ఆలయాలు నిర్మించారు. ఇందులో ఆంజనేయస్వామి, వినాయకుడు, జైన ఆలయాలు, అమ్మవార్ల ఆలయాలు, కాశీ విశ్వేశ్వర, ఐముక్తేశ్వర, నగరేశ్వర, రామభద్రాలయం వంటి ఎన్నో కట్టడాలు నిర్మించిన మహనీయులు విజయనగర రాజులు.

బాబయ్య దర్గా ప్రత్యేకం..

పెనుకొండలోని బాబయ్య దర్గా ఓ మహిమాన్విత ప్రదేశం. నిత్యం ఇక్కడ పెద్దయెత్తున భక్తులు బాబయ్య స్వామికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ. ఏటా బాబయ్య స్వామి గంధం వేడుకలు, సర్వమత సమ్మేళనం, ఉరుసు పెద్దయెత్తున జరుగుతుంది. లక్షలాది మంది జనం ఈ ఉరుసుకు హాజరవుతారు. హిందూ, ముస్లింల మధ్య పెనుకొండలో ఎంతో సఖ్యత ఉంటుంది. ఇక్కడ ప్రజలు వ్యాపారాలతో పాటు సామిల్లులు, హోటల్లు, దుకాణాలు, బీడి వృత్తితో, మెకానిక్ షాపులు నిర్వహిస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. రైలు ప్రయాణానికి పెనుకొండ ఎంతో అనువైనది. గ్రామ పంచాయితీగా వున్న పెనుకొండను నాటి జగనన్న ప్రభుత్వంలో నగర పంచాయితీగా తీర్చిదిద్దారు. పట్టణంలో జగనన్న ప్రభుత్వంలో నిర్మించిన డబుల్‌లేన్ రోడ్డు పట్టణాభివృద్ధికి దోహదం చేస్తోంది.

మెడికల్ కళాశాల ఓ వరం..

పెనుకొండకు మెడికల్ కళాశాల రావడం ఓ వరం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి షీఫారం ప్రాంతంలో 50 ఎకరాల స్థలం కేటాయించి ఇందుకు సంబంధించి రాష్ట్ర వాటాతో పాటు నాబార్డ్ నిధులు రూ. 475 కోట్లతో నిర్మిచడానికి చర్యలు చేపట్టారు. ఇందులో మెడికల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి పనులు అండర్‌గ్రౌండ్‌తో పాటు 3 ఫ్లోర్‌ల పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం పనులు నిలిపివేయగా పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కియాతో పెరిగిన సందడి..

పెనుకొండ సమీపంలో కియా కార్ల పరిశ్రమ రావడంతో పట్టణంలో నిత్యం సందడి వాతావరణం కనిపిస్తుంది. దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి కార్మికులు ఇక్కడికి వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. ఇందులో ఏపీతో పాటు జార్కండ్, చత్తీస్‌ఘడ్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిషా, తెలంగాణా, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉన్నారు. పురుషులకు దీటుగా మహిళలు కియా అనుబంధ సంస్థల్లో పని చేస్తున్నారు.

ఆకట్టుకునే పసరక్కర బావి..

విజయనగర రాజుల కాలంలో నిర్మించిన అతి విశాలమైన బావి ఇది. ఇంత పెద్దబావి సత్యసాయి, అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో ఎక్కడా లేదు. చేతితో బావిని దాటి రాయి విసరగల సమర్థులు ఇంత వరకు ఎవరూ లేరంటే అతిశయోక్తి కాదు. అప్పట్లో పెనుకొండ ప్రాంత వాసులు తాగునీటి అవసరాల కోసం దీన్ని తవ్వారు. ఇదే కాక నాటి రాజరికపు వైభవాన్ని చాటే బావులు ఇక్కడ ఎన్నో ఉన్నాయి. వీటిని తిలకించడానికి ఎన్నో ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. పెనుకొండకు నాలుగు దిక్కులా నాలుగు ఊరు వాకిళ్లు వుండేవి. అందులో 3 దిక్కులలో ఇప్పటికీ ప్రజలు నిత్యం సంచరిస్తూనే ఉంటారు. ఉత్తరం వైపు వున్న ఊరు వాకిలి అందులో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ఎంతో మహిమాన్వితమైనది. అనునిత్యం ఈ ఆలయంలో ప్రజలు పూజలు ఆచరిస్తూనే ఉంటారు. ఈ ఊరువాకిళ్లు కోటగోడకు అనుసంధానంగా ఉన్నాయి. విజయనగర రాజుల కాలంలో నిర్మించిన కట్టడాల్లో బసవణ్ణ బావి ఎంతో ప్రధానమైనది. రాణులు ఈ బావిలో ఎంతో పవిత్రంగా స్నానమాచరించే వారనే పేరుంది. అనంతరం సమీపంలోనే ఉన్న నాట్యమండపంలో నాట్యం చేసి రాణుల నివాసానికి వెళ్లే వారని చరిత్ర చెబుతున్న సత్యం.